ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
మంగళవారం 17 సెప్టెంబరు 2024





గణపతులతో చిన్నారులు

పార్వతి తనయా పాహిమాం..



జగిత్యాలలో నిమజ్జనం చేస్తున్న భక్తులు

- వైభవంగా గణపతి నిమజ్జన వేడుకలు
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, బల్దియా చైర్ పర్సన్

జగిత్యాల క్రైం , సెప్టెంబరు 16 : వినాయకా.. వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్య మళ్లీ రావయ్యా.. అంటూ భక్తులు గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. 9 రోజుల పాటు అత్యంత వైభవంగా పూజలు చేసిన వినాయక నిమజ్జన వేడుకలు సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో అంబరాన్నంటాయి. జగిత్యాల పట్టణంలో ఉదయం నుండే గణపతుల శోభాయాత్ర ప్రారంభమైంది. భక్తులు శోభాయాత్రకు తరలిరా వడంతో టవర్, చింత కుంట చెరువు ప్రాంతాలు భక్త జనంతో కిటకిటలాడాయి.

ఆనందోత్సాహాల మధ్య..

జిల్లా కేంద్రమైన జగిత్యాలలో గణేశ్ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువకులు, మహిళలు, చిన్నారులు నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. 9 రోజలు పాటు నిష్ఠతో పూ జలు చేసిన గణనాథునికి వీడ్కోలు పలికేందుకు పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు. మహిళలు ప్రత్యేక అలంకరణలో కోలాటం ఆడుతూ నృత్యాలు చేశారు. యువతీ, యువకులతో పాటు చిన్నారులు ఆడుతూ, పాడు తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. జగిత్యాల పట్టణంలోని చింతకుంట వద్ద నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, ముందు జాగ్రత్తగా చెరువులోకి వెళ్లకుండా బారీకేడ్లను ఏర్పాటు చేశారు. జగిత్యాల టవర్ వద్ద విశ్వహిం దూ పరిషత్ ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలివచ్చే వినాయకుని వద్ద టెం కాయ కొట్టడంతో పాటు ఒక మెమోంటోను అందజేశారు. పట్టణ వాసులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు నిమజ్జన వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, భక్తుల సౌకర్యార్థం ఉచితంగా మంచినీటి వసతి కల్పించారు. మూడు భారీ క్రేన్‌లతో పాటు గణనాథులను చెరువులోకి తరలించేందుకు తెప్పెలను ఏర్పాటు చేశారు. చెరువు వద్ద మున్సిపల్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు నిమజ్జన వేడుకలను పర్యవేక్షించారు.

భారీ బందోబస్తు

జగిత్యాలలో సోమవారం నిమజ్జన వేడుకలు జరుగగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో 580 మంది పోలీస్ అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా డిస్ట్రిక్ట్ గార్డ్ పోలీసులు ప్రధాన చౌరస్తాల్లో మొహరించి విధులు నిర్వహించారు.

● వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా పట్టణంలోని వివిధ వినాయక మండపాలతో పాటు చింతకుంట చెరువు వద్ద బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి స్థానిక కౌన్సిలర్లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన వేడుకలను ప్రారంభించారు. స్వయంగా నాటు తెప్పపై చెరువులోకి వెళ్లి వినాయకులను నిమజ్జనం చేశారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు టవర్ వద్ద శోభాయాత్రగా వస్తున్న వినాయకులకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు తాటాకీ వేషాధారణలతో ఆకట్టుకున్నారు. పట్టణంలోని అన్ని రహదారుల గుండా వినాయక శోభాయాత్రలు కొనసాగగా అర్ధరాత్రి వరకు నిమజ్జన వేడుకలు కొనసాగాయి.

పోటా పోటీగా లడ్డూల వేలాలు..

వినాయక నవరాత్రుల సందర్భంగా మండపాల్లో ప్రతిష్ఠించిన వినా యకుని వద్ద భక్తి శ్రద్ధలతో ఏర్పాటు చేసిన లడ్డూలకు 9 రోజల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నిమజ్జనం రోజు వేలం వేసే సంస్కృతి గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతుంది. శ్రీ లక్ష్మి గణేష్ మందిరంలో లవంగ రంజిత్ దంపతులు రూ. 1,34,116 లక్షలకు వేలంలో లడ్డూలను దక్కిం చున్నారు. అలాగే వైశ్య భవన్‌లో సుదర్శన్ ఇంజనీరింగ్ కంపనీ నిర్వా హకులురూ. 70,011 వేలకు వేలంలో లడ్డూను దక్కించున్నారు.

మెట్‌పల్లిలో భారీ బందోబస్తు

మెట్‌పల్లి : జైజై గణేషా..బైబై గణేషా..గణపతి బొప్పా మోరియా... అంటూ మెట్‌పల్లి పట్టణం మారుమోగిపోయింది. తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలందుకున్న గణనాథుడు సోమవారం నిమజ్జనోత్సవానికి తరలివెళ్లిపో యాడు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్ ఎర్సన్ రాణవేని సుజత-సత్యనారయణ, డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, కమిషనర్ మోహన్ ఆధ్వర్యంలో వట్టి వాగు వద్ద ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. విగ్రహాలను శోభయాత్రగా తీసుకెళ్లి పట్టణ శివారులోని వట్టి వాగులో నిమజ్జనం చేశారు. యువకులు, మహిళలు, చిన్నారులు నిమజ్జన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నృత్యాలు చేస్తూ భక్తిశ్రద్ధలతో గణపయ్యను సాగనంపారు. ఎలాంటి అల్లర్లు జరుగకుండ మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు, కాంగ్రెస్ నాయకులు, యువజన సంఘల నాయకులు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

వినాయక నిమజ్జనం సందర్భంగా పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ యూత్ సభ్యులు మత సామరస్యం చాటుకున్నారు. వినాయక విగ్రహాల ఊరేగింపు సందర్భంగా ముస్లిం యువకులు పలు ప్రాంతాల్లో భక్తులకు మంచినీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లింపూర యూత్, మార్వేల్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ఆట పాట

కోరుట్ల : పట్టణంలోని వివిధ పాఠశాల విద్యా ర్థులు, పలు చిన్నారులు చేసిన నృత్యాలు పట్టణ ప్రజలను ఆకట్టుకున్నాయి. పలు వార్డులలో చిన్నా రులు, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు వినాయ కుడి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు నిమజ్జ నోత్సవాలను సోమవారం జరిపారు. ఈ సందర్భంగా గణపతి రథాలతో శోభ యాత్ర జరిపారు. పాఠశాల విద్యార్థులు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి కోలాటాలు ఆడుతూ దాండియా నృత్యాలు చేశారు. భక్తి శ్రద్ధలతో గణేష్‌ని విగ్రహాలను పట్టణ శివారులోని వాగులో నిమజ్జం చేశారు.



రాయపట్నం వద్ద..



జగిత్యాలలో నిమజ్జన వేడుకలు పరిశీలిస్తున్న ఎస్పీ



జగిత్యాలలో కారుపై వినాయకుడు..గణపయ్యతో చిన్నారులు



నిమజ్జన వేడుకలు ప్రారంభిస్తున్న జీవన్‌రెడ్డి



మెట్‌పల్లిలో నిమజ్జనానికి బయలుదేరుతున్న గణనాథులు



మంచినీటిని పంపిణీ చేస్తున్న ముస్లిం యూత్ సభ్యులు



జగిత్యాలలో మహిళల శోభాయాత్ర..



జగిత్యాలలో వినాయక శోభయాత్ర



కోరుట్లలో చిన్నారుల కోలాటాలు..



మాదాపూర్‌లో మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



నిమజ్జన వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్

గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

ఎస్పీ అశోక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 16 :గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు చేపట్టినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బీఎల్ఎన్ గార్డెన్‌లో సోమవారం పోలీస్ అధికారులతో భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ సమీక్ష సమావే శాన్ని నిర్వహించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 580 మంది పోలీస్ అధికారులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత నిమజ్జనానికి ప్రజలు సహకరించాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా ప్రజలు చెరువులు, కుంటల వద్దకు ఎక్కువగా రానున్న దృష్ట్యా భద్రత చర్యలు తీసుకుని వారితో మర్యాదగా ప్రవర్తిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు రఘు చందర్, రవీంద్ర కుమార్, రంగారెడ్డి, ఇన్స్‌పెక్టర్లు ఆరీఫ్‌అలీ ఖాన్, వేణు గోపాల్, రాంనర్సింహా రెడ్డి, రవి, కృష్ణారెడ్డి, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ వేణు ఉన్నారు.

మాతా శిశు ఆసుపత్రిలో ఆందోళన

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 16 : జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఉన్న మాతా శిశు ఆసుపత్రిలోని చిన్న పిల్లల విభాగంలో రోగుల బంధువులు ఆందోళన చేపట్టారు. పురుగులు పట్టిన అల్పాహారం, ఉడికీ ఉడకని భోజనం ఇస్తున్నారంటూ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన అల్పాహారంతో పాటు భోజనం అందించాలని రోగుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ ఘటనపై భోజనం అందించే నిర్వాహకుడిని వివరణ కోరగా నిబంధనల మేరకే నాణ్యమైన అల్పాహారంతో పాటు భోజనం అందిస్తున్నామని దాటవేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు పూర్తి విచారణ చేపట్టాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న ప్రజా పాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో పలు ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా పాలన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పతాకావిష్కరణ చేయాలని సూ చించారు. కలెక్టరేట్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మొదట జాతీయ గీతం ఆలపించిన తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ముఖ్యఅతిథిగా వస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రసంగం ఉంటుందన్నారు. గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు జెండా ఎగురవేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతంరెడ్డి, మెట్‌పల్లి, జగిత్యాల ఆర్డీవోలు శ్రీనివాస్, మధుసూదన్, డీఎస్పీ రఘుచందర్, కలెక్టరేట్ కార్యాలయ ఏవో హన్మంతు రావు, జిల్లా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

రెస్టారెంట్‌పై ఫిర్యాదు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 16 : జిల్లా కేంద్రంలోని కరీంనగర్ రోడ్‌లో ఉన్న ఓ రెస్టారెంట్‌పై వినియోగదారుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన రమేష్ అనే వ్యక్తి రెస్టారెంట్‌కు వెళ్లి బిర్యాని ఆర్డర్ ఇచ్చాడు. బిర్యాని సరిగ్గా ఉడుకలేదు అని నిర్వాహకునితో తెలిపి అసహనం వ్యక్తం చేశాడు. నిర్వాహకుడు రమేష్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

భీమారం, సెప్టెంబరు 16: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కొత్తపెల్లి భాస్కర్‌కు రూ.25 వేలు, పిడుగు రాజరెడ్డి బక్కన్నకు రూ.60 వేల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొత్తపల్లి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

'ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలి'

ధర్మపురి, సెప్టెంబరు 16: ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించాలని ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నది వద్ద వినాయక నిమజ్జనం కోసం సోమవారం ఆయన ఏర్పాట్లను పరిశీ లించారు. వివిధ శాఖల పక్షాన చేపట్టాల్సిన ఏర్పాట్లు గురించి సంబంధిత అధికారులతో ఆయన చర్చించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ శాఖ పక్షాన ధర్మపురి, రాయపట్నం రెండు ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ధర్మపురి, బుగ్గారం, వెలగటూర్ ఎస్ఐలు గంగుల మహేష్, శ్రీధర్‌రెడ్డి, ఉమాసాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గోదావరి వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ

మత్స్యకారుడికి చిక్కిన భారీ చేప



28కిలోల చేపతో మత్స్యకారుడు తిరుపతి

తిమ్మాపూర్,సెప్టెంబరు16: తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి మోయతుమ్మెద వాగులో ఓ మత్స్యకారుడి వలకు 28కిలోల చేప చిక్కింది. తిమ్మాపూర్ మండలం సంగంపల్లికి చెందిన తిరుపతి అనే మత్స్యకారుడు సోమవారం కొత్తపల్లి గ్రామం వద్ద లోయర్ మానేరు డ్యాం బ్యాక్ వాటర్ విస్తరించి ఉన్న మోయతుమ్మెద వాగులో వలతో చేపలు పడుతుండగా 28కిలోల బొచ్చె వలకు చిక్కింది. భారీ చేప వలకు చిక్కడంతో తిరుపతి సంతోషం వ్యక్తం చేశాడు. ఈ చేప ధర సుమారు 5వేల రూపాయల వరకు ఉంటుందని స్థానిక మత్స్యకారులు తెలిపారు. ఇటీవల పుష్కలంగా వర్షాలు పడటంతో జలాశయాలలో మత్సకారులకు భారీ చేపలు దొరుకుతున్నాయి. ఇంత పెద్ద చేప ఈ ప్రాంతంలో దొరకడం అరుదైనదిగా వారు పేర్కొంటున్నారు.

10 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న బియ్యం ట్రక్కు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16: గోదావరిఖని 2ఏ మోరీ సమీపంలో వన్‌టౌన్ క్రైమ్ పార్టీ పోలీసులు 10టన్నుల బియ్యాన్ని ఆదివారం రాత్రి పట్టుకున్నారు. రామగిరి మండలం బేగంపేట కేంద్రంగా రేషన్ బియ్యంను మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారు. రేషన్‌షాపులు, గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని దర్జాగా తరలిస్తున్నారు. ఈ తరలింపునకు ట్రక్కులే కొనుగోలు చేశారు. ఆదివారం రాత్రి బేగంపేట నుంచి మహారాష్ట్రకు ట్రక్కులో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు గోదావరిఖని 2ఏ మోరీ సమీపంలో వన్‌టౌన్ క్రైమ్ పార్టీ పోలీసులు అడ్డుకున్నారు. టీఎస్22 టీఏ1431 ట్రక్కులో 10టన్నుల రేషన్ బియ్యం, రేషన్ బియ్యం సరఫరాకు సివిల్ సప్లై వాడే గోనె సంచులు కూడా దొరికినట్టు తెలుస్తోంది. ట్రక్కును వన్‌టౌన్‌కు తరలించి ట్రక్కులో ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నారు. రెండు నెలల క్రితం కూడా బేగంపేటకు చెందిన రేషన్ బియ్యం మాఫియా మహారాష్ట్రకు తరలిస్తుండగా ట్రాలీలను పోలీసులు పట్టుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఎస్జీటీ యూనియన్ వినతి

కరీంనగర్ టౌన్/భగత్‌నగర్, సెప్టెంబరు 16: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని కోరుతూ సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర శాఖ బాధ్యులు సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్జీటీ రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, మదుసూదనరావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాం శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీధర్‌రెడ్డి, శాంతికిరణ్, శశిధర్, విజేందర్‌రెడ్డి, శేఖర్, మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్స్ డే వేడుకలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 16: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని కాళేశ్వరి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంజనీర్లను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కంది జ్యోతి, కస్తూరి భారతి, సిద్ధి సరిత, కొండ రాధిక, రాగి వందన, కొండూరి రాధిక, చింతల లావణ్య పాల్గొన్నారు.

● బొమ్మకల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలవురు ఇంజనీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బట్టు రాజేందర్, జోన్ చైర్‌పర్సన్ చింతల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద



జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి సోమవారం వరద నీరు రావడం తగ్గింది. ఎస్సారెస్పీలోకి 10,465 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 10,465 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అటవీ శాఖ అధికారులకు నెమలి అప్పగింత



అధికారులకు నెమలిని అప్పగిస్తున్న యువకుడు

చందుర్తి, సెప్టెంబరు 16 : చందుర్తి మండలం బండపల్లిలో చెరువు ప్రాంతంలో కాలుకు గాయమైన జాతీయపక్షిని గ్రామానికి చెందిన యువకులు రక్షించారు. కాలుకు గాయమై ఇబ్బంది పడుతున్న నెమలిని గమనించిన నాగరాజు, వేణు, మణిసాగర్ అటవీశాఖ సెక్షన్ అధికారి అన్వర్ హుస్సేన్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం దానికి వైద్యం చేసి అటవీశాఖ అధికారులకు అప్పగించగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

భూ వివాదం పరిష్కరించాలని సెల్ టవర్ ఎక్కిన వ్యక్తి



సెల్ టవర్ ఎక్కిన పొన్నాలు

చందుర్తి సెప్టెంబరు 16: తన సోదరుడితో కొన్ని సంవత్సరాలుగా భూ వివాదం నడుస్తోందని, సమస్య పరిష్కరించే న్యాయం చేయాలని ఓ వ్యక్తి పురుగుల మందు డబ్బాతో చందుర్తి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట సెల్ టవర్ ఎక్కాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన బొజ్జ గట్టు పొన్నాలుకు అతడి తమ్ముడు మోహన్‌తో భూ వివాదం కోర్టులో ఉంది. సమస్య పరిష్కారం కావడం లేదని, తనకు న్యాయం చేయాలని పురుగుల మందు డబ్బాతో చందుర్తి చేరుకొని సెల్ ఎక్కాడు. ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొనడంతో సీఐ వెంకటేశ్వర్లు న్యాయం చేస్తామని, సెల్‌టవర్ దిగి రావాలని సూచించారు. దీంతో టవర్ దిగి వచ్చాడు.

'నవోదయ' ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

చొప్పదండి, సెప్టెంబర్ 16 : జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష దరఖాస్తు గడువును పెంచినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 16నుంచి 23 వరకు విద్యాలయ సమితి పెంచినట్లు ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



చింతల గుట్ట నుంచి తవ్విన మట్టి



మట్టిని టిప్పర్లలో నింపుతున్న ఎక్స్‌కవేటర్

తోడేస్తున్నారు..



తవ్వి తొలగించిన బండరాళ్లు

- అనుమతులు లేకుండా మట్టి తరలింపు
- కరుగుతున్న గుట్టలు
- పట్టించుకోని అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 : తిమ్మాపూర్ మండలంలోని గుట్టలను ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వి కొందరు యథేచ్ఛగా మట్టిని విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కొద్ది రోజులుగా ఈ దందా బహిరంగంగానే కొనసాగుతోంది. తిమ్మాపూర్ మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూమి, గుట్టలు అంటూ చూడకుండా కొందరు ఇష్టారీతిలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రామకృష్ణ కాలనీ గ్రామ శివారు చెర్లపల్లిలో చింతలగుట్టను ధ్వంసం చేస్తూ కొన్ని రోజులుగా జేసీబీలతో మట్టి తీసి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ఒక టిప్పర్‌కు 2,800 నుంచి 3వేల రూపాయల చొప్పున మట్టి విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండిపెడుతున్నారు. చింతలగుట్ట పట్టా భూమి అని అది ఉల్లెంగుల ఏకానందం అనే వ్యక్తికి సంబంధించిన భూమి అని అతని అనుమతితోనే మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు అక్కడ ఉన్న వ్యక్తులు తెలిపారు. పట్టా భూమి అయినా మట్టి తవ్వకాల కోసం ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సి ఉండగా ఇవేవీ వీరు పట్టించుకోక పోవడంతో పాటు ఇష్టారీతిలో తవ్వకాలు చేపడుతున్నారు. పట్టా భూమిలోని మట్టిని పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు తరలించాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని అధికారులు తెలిపారు. తవ్వకాలకు సంబంధించిన వ్యక్తి ఏకానందం తన భూమి తన ఇష్టం అని అధికారులను తాను చూసుకుంటు న్నానని చెప్పడం గమనార్హం. మట్టి తవ్వకాలకు, మట్టి విక్రయాలకు ఎవరి అనుమతి అవసరం లేదని తన భూమి తనఇష్టం అని ఆయన పేర్కొన్నాడు. అధికారులకు సమాచారం అందడంతో మట్టి తవ్వకాలు నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చరిత్రను కనుమరుగు చేస్తున్నారు

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 16 : ప్రజా పాలన పేరుతో తెలంగాణ చరిత్రను కనుమరుగు చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్‌లో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎవరికి భయపడి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిజాంపై పోరాడి ప్రాణాలర్పించిన వారి త్యాగాలను అవమానిస్తున్నారన్నారు. అందుకే తెలంగాణ ప్రజా పాలన కార్యక్రమాలకు హాజరు కావడం లేదన్నారు. కాంగ్రెస్‌కు చేతనైతే తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తే తప్పకుండా హాజరవుతామన్నారు. కేంద్రం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన దినోత్సవానికి హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. సర్దార్‌పటేల్ పోలో ఆపరేషన్‌తోనే నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. ఎంఐఎం పార్టీకి బయపడి ఒక వర్గం ఓట్లకోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించకుండా ప్రజలను వంచిస్తున్నాయన్నారు. రజాకార్ పార్టీ వారసుడు ఓవైసీ ప్రభుత్వ భూములను కబ్జాచేసి పేదలను దోచుకుంటున్నాడని బండి సంజయ్ ఆరోపించారు. అలాంటి ఓవైసీ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కూల్చ కుండా ఓవైసీకి వంతపాడుతున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే హైదరాబాద్‌లో పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సర్దార్ పటేల్ మాకు వీరుడే అని, పటేల్ వారసులం మేమే అని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి మరల్చేందుకే రాజీవ్ విగ్రహం తెరపైకి తెచ్చారన్నారు. ఖాళీగా ఉన్న కేసీఆర్ కుటుంబానికి ఢిల్లీ సీఎం పదవి ఇచ్చేందుకే కేజ్రీవాల్ రాజీనామా చేశారేమోనని ఎద్దేవా చేశారు. వారిద్ద రిది లిక్కర్ బంధమన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణలో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనంపై రాష్ట్ర ప్రభుత్వం గణేష్ ఉత్సవ కమిటీతో చర్చించి అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. హిందు పండుగలపై వివక్ష చూపుతున్నారనే భావన ఉందన్నారు. నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించు కుని పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బండి సంజయ్ అన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

కొడిమ్యాల, సెప్టెంబరు 16 : మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన మామిడి చంద్రయ్య (52)అనే వ్యక్తి మతి స్థిమితం సరిగా లేక ఆదివారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ అర్జరాజు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు చంద్ర య్య ఆర్థికంగా ఇబ్బందులపాలై, మద్యానికి బాని సయ్యాడు. దీంతో మతిస్థిమితం సరిగా లేక ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. చంద్రయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర యోగా ఛాంపియన్‌గా ఉమ్మడి జిల్లా జట్టు



ఛాంపియన్ షిప్‌ను అందుకుంటున్న ఉమ్మడి జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16: తెలంగాణ రాష్ట్రస్థాయి యోగాసన ఛాంపియన్ షిప్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సాధించింది. ఈనెల 14, 15 తేదీల్లో హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో ఉమ్మడి జిల్లాజట్టు 116 పాయింట్లు సాధించి మొదటి స్థానంతో పాటు ఓవర్‌ఆల్ ఛాంపి యన్ షిప్‌ను అందుకుంది. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకా రులు 7బంగారు, 4 రజత, 4 కాంస్య పతకాలతో పాటు 5వ స్థానంలో నలుగురు, 6వ స్థానంలో ఆర్గురు క్రీడాకా రులు నిలిచి కప్పును కైవసం చేసుకున్నారు. అలాగే ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాష్ట్రం లోనే అత్యధికంగా 16 మంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఛాంపియన్స్‌గా నిలిచిన జిల్లా జట్టును జిల్లా యోగా సంఘం అధ్యక్ష కార్యదర్శులు సర్దార్ రవీందర్‌సింగ్, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, డివైఎస్ఓ శ్రీనివాస్‌గౌడ్, యోగా సంఘం ఉపాధ్య క్షుడు కన్న కృష్ణ, కోచ్‌లు రామకృష్ణ, వి కిష్టయ్య, మల్లేశ్వరి, స్వరూపాచారి, మనోజ్‌కుమార్, విజయ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

జిల్లా జైలులో గాంధీ విగ్రహం ఆవిష్కరణ



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జైళ్ల శాఖ డీఐజీ సంపత్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 16 : కరీంనగర్ జిల్లా జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సోమవారం జైళ్ళశాఖ డీఐజీ ఎం.సంపత్ ఆవిష్కరిచారు. జిల్లా జైలును వరంగల్ రేంజ్ డీఐజీ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్‌ప్రిజన్స్) ఎం.సంపత్ సంవత్సర తనిఖీలో భాగంగా సందర్శించారు. జైలులో ఖైదీల యోగ క్షేమాలను, భోజన వసతులు, న్యాయసేవా, ఆరోగ్యసమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత జైలులో కాంటీన్, జైలు ఆసుపత్రి ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, ఖైదీల టాయిలెట్లు, శుభ్రత, వంటశాల, జైలు ఇండస్ట్రీ, పెట్రోల్ బంకులలో పని తీరును తెలుసుకుని అధికారులను అభినందించారు. జైలులోని గార్డెనింగ్ నిర్వహణ, పరిశుభ్రత బాగుందని అధికారులను అభినందించారు. మహిళా జైలును కూడా డీఐజీ సందర్శించారు. అనంతరం జైలు క్వార్టర్‌లో శ్రీ విఘ్నేశ్వర స్వామి పూజలో డీఐజీ పాల్గొన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైద్యాధికారి వేణు గోపాల్, జైలర్స్ శ్రీనివాస్, రమేష్, పర్శ రామ్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేష్ సుధాకర్ రెడ్డి, సంగీత పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులపై కుక్కల దాడి

బీర్‌పూర్,సెప్టెంబరు 16 : బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కలు సోమవారం దాడి చేశాయి. గ్రామంలోని చెందిన పోతు రమేష్ కుమారుడు రాణా(9), బొమ్మి డి శశిధర్ కూతురు అద్విశ్రీ(4) అనే చిన్నారులు వారి ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా వీధికుక్కలు ఇద్దరు చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచాయి. పిల్లల అరుపులు విన్న రాణా తల్లి గమనించి కుక్కల దాడి నుంచి పిల్లలను రక్షించారు. వెంటనే చిన్నారులను ఆసుపత్రికి తరలించారు.

'నవోదయ'లో ముగిసిన కళోత్సవాలు



విద్యార్థుల ప్రదర్శనలు

చొప్పదండి, సెప్టెంబర్ 16 : చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో కళోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆదివారం ఉత్సవాలు ప్రారంభం కాగా రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. తెలంగాణ క్లస్టర్ స్థాయిలోని తొమ్మిది జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ ఉత్సవాలకు హాజరై వివిధ పోటీలలో పాల్గొన్నారు. నల్లగొండ విద్యాలయం వోకల్ మ్యూజిక్, నృత్యంలో నాగర్‌కర్నూల్, కరీంనగర్ ఇన్‌స్ట్రు మెంటల్, నిజామాబాద్ స్టోరీ టెల్లింగ్, మెదక్ విద్యాలయం విజువల్‌ఆర్ట్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగతాయారు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

సింగరేణి కార్మికుడి అనుమానాస్పద మృతి

- ఒంటిపై తీవ్రగాయాలు
- నెల రోజుల్లో పదవీవిరమణ
- మృతిపై అనేక సందేహాలు
- మార్చురీకి తరలించిన పోలీసులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16 : గోదావరిఖని ఐబీ కాలనీలో నివాసముండే సింగరేణి కార్మికుడు బానోత్ హరిసింగ్(60) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతని గొంతు, ఛాతి, కాళ్లపై గాయాలున్నాయి. హరిసింగ్ కుటుంబం ఐబీ కాలనీలోని క్వార్టర్ నంబర్ 612లో నివాసముంటున్నది. అతనికి భార్య దస్లి, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురుకు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. హరిసింగ్ మెడికల్ అన్‌ఫిట్‌కు ప్రయత్నించగా అన్‌ఫిట్ కానట్టు తెలుస్తోంది. నెలరోజుల్లో పదవీ విరమణ ఉన్నట్టు సమాచారం. సోమవారం సాయంత్రం హరిసింగ్ భార్య దస్లి బయటకు వచ్చి తన భర్త పరిస్థితి విషమంగా ఉందని స్థానికులకు చెప్పడంతో వారు గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అతడు మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. మృత దేహంపై గాయాలు ఉండటంతో వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. హరిసింగ్ మృతిపై అనుమానాలు ఉండడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

● గుర్తు తెలియని వ్యక్తుల సంచారం..

సోమవారం మధ్యాహ్నం నుంచి హరిసింగ్ ఇంటి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు సంచారంతో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గణపతులు వచ్చిన సమయంలో ఇద్దరు వ్యక్తులువచ్చి వెళ్లారని, కొద్దిసేపటికే హరిసింగ్ మృతి చెందారనే చర్చ జరుగుతోంది.

● మృతిపై అనుమానాలున్నాయి...

- వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని ఐబీకాలనీలో హరిసింగ్ మృతిపై అనుమానాలున్నాయి. మృతదేహాన్ని మార్చురీకి తరలించాం. దీనిపై దర్యాప్తు చేస్తున్నాం. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తాం.

పోలీస్ సైరన్‌తో తిరుగుతున్న వాహనం సీజ్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16 : పోలీస్ సైరన్ వాహనానికి అమర్చుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. సోమారంపేట గ్రామానికి చెందిన వంగ శ్రీనివాస్ తన డ్రైవర్ పల్మారి శ్రీనివాస్‌తో కలిసి నిబంధనలకు విరుద్ధంగా కారుకు పోలీస్ సైరన్ అమర్చుకున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామానికి హైడ్‌కానిస్టేబుల్ దేవేందర్ వెళ్లగా సైరన్ బిగించిన వాహనాన్ని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసున మోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 16 : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ మంటలు అంటుకుని తీవ్ర గాయాలై చికిత్స పొంతుతున్న వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. పట్టణంలోని పద్మనగర్ ప్రాంతానికి చెందిన సింగం సుగుణ(80) అనే వృద్ధురాలు ఆదివారం తన ఇంటలో వంట చేస్తున్న సమయంలో ప్రమాదావశాత్తు గ్యాస్ సిలిండర్ మంటలు అంటుకుని తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అదే రోజు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుగుణ సోమవారం మృతి చెందింది. మృతుడి కుమారుడు గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసునమోదు చేసినట్లు వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయ కూలీ ఆత్మహత్య

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావుపల్లెకు చెందిన ఏనుగుల ముత్తయ్య(33) అనే వ్యవసాయ కూలీ ఆర్థిక ఇబ్బందులతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం .. ముత్తయ్య గ్రామంలో ఉపాధిలేక పోవడంతో రెండుసార్లు విదేశాలకు వెళ్లాడు. అక్కడా సరైన పని దొరకక ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ముత్తయ్యకు రూ.3 లక్షల అప్పులు అయ్యాయి. అనంతరం ఇంటికి వచ్చి వ్యవసాయం చేసినా అప్పులు తీరలేదు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారం గ్రామసమీపంలో సోమవారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.



గేట్లు ఎత్తడంతో కిందకు వస్తున్న నీరు

ఎల్‌ఎండీ గేట్లు ఎత్తిన అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 16 : ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో పాటు మధ్యమానేరు నుంచి సుమారు 3వేల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఎల్‌ఎండీ జలాశయం ప్రధానగేట్లు సోమవారం ఉదయం 9.30 గంటలకు ఇరిగేషన్ ఎస్ఈ పెద్ది రమేష్ ఆధ్వర్యంలో అధికారులు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. అనంతరం నీటిలో ఇరిగేషన్ అధికారులు పూలుజల్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ పెద్ది రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం లోయర్ మానేర్ డ్యాంలో 23.90 టీఎంసీల నీరు ఉందని ఎగువ ఎంఎం ఆర్ నుంచి 3వేల క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తుండటంతో రెండు గేట్లు ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ పెద్ది రమేష్, ఈఈ నాగభూషణం, డీఈ శ్రీనివాస్, ఏఈఈలు కాళిదాస్, వంశీధర్, అంజుమునీసా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెండు గంటల తర్వాత తిరిగి మూసివేత

ఎస్సారెస్పీ నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఎంఎంఆర్ నుంచి మూడు వేల క్యూ సెక్కు లు ఎల్‌ఎండిలోకి విడుదల చేశారు. దీంతో అధికారులు 11.30 గంటల సమయంలో గేట్లు మూసివేశారు. అనంతరం కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను మూడువేల క్యూసెక్కులకు పెంచారు. ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.947 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో 4,732, ఔట్‌ఫ్లో 3,309 క్యూసెక్కులు ఉంది.

బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలి..

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఎండపల్లి, సెప్టెంబరు16: మండలంలోని రాజారాంపల్లి బ్రిడ్జి వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రజల రాకపోకలకు చాలా ఇబ్బంది కలుగుతోందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు అన్నారు. సోమవారం రాజారాంపల్లిలో మండ నాయకులతో కలిసి విలే కర్ల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజారాంపల్లి వంతెన నిర్మాణం చేపట్టిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదన్నారు. 15 రోజుల క్రితం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వచ్చి బ్రిడ్జిని సందర్శించినా పని ప్రారంభించలేదని అన్నారు. ఈ రహదారి గుండా నిత్యం వాహనాలకు చాలా ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రావు హన్మంత రావు, ఉపాధ్యక్షులు గంగా చలం, పున్నం రెడ్డి, భాస్కర్ రెడ్డి, జక్కుల సాగర్, రామాంజనేయులు, శ్రావణ్ పాల్గొన్నారు.

రూ.1.77 లక్షలు పలికిన లడ్డూ ధర



లడ్డూ దక్కించుకున్న సంతోష్‌రావు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 16: పట్టణంలోని స్థానిక వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ మండలం వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంఘ సభ్యుల సమక్షంలో లడ్డూ వేలం నిర్వహించగా, అంబారిపేట్ గ్రామానికి చెందిన అన్నమనేని సంతోష్ రావు-అజిత దంపతులు రూ.1.77వేలు పలికి లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వినాయకుడి మెడలో నాగుపాము



జగిత్యాలలో వినాయకుడి విగ్రహంపై ఉన్న నాగు పాము

జగిత్యాల క్రైం సెప్టెంబరు 16 : జగిత్యాల జిల్లా కేంద్రంలో పూజలు అందుకున్న వినాయకుడి మెడలో ఓ నాగుపాము భక్తులకు దర్శనం ఇచ్చింది. జిల్లా కేంద్రంలోని వాణి నగర్ ధర్మశాల ఆవరణలో త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో గణపతిని ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. సోమవారం ఉదయం వినాయకుడి వద్దకు నాగుపాము చేరుకుని వినాయకుడి విగ్రహంపైకి ఎగబాకి మెడలో నాగాభరణంగా మారింది. భక్తులు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొద్ది సేపటికి నాగుపాము సమీప ఆలయంలోకి వెళ్లింది. ఇది చూసిన నిర్వాహకులు, భక్తులు సోమవారం నాగుపాము గణపతిపైకి రావడం విశేషమంటూ మొక్కుకున్నారు.

ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో కోరుట్ల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ ప్రసన్న కుమార్, టీవీ యాక్టర్ సెల్వమని

కోరుట్ల, సెప్టెంబరు 16 : కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో కోరుట్ల ఒకినోవా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ కనపరిచి వివిధ పతకాలు సాధించి ప్రతిభ కనపరిచినట్లు కరాటే కోచ్ అల్లే రమేష్ సోమవారం తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీలలో దీక్షిత, శంకర్ కటాస్ విభాగంలో బంగారు పతకం సాధించినట్లు ఆయన తెలిపారు. బంగారు పతకంతో పాటు వివిధ విభాగాలలో రాణించిన విద్యార్థులను టోర్నమెంట్ ఆర్గనైజర్ ప్రసన్నకుమార్, టీవీ యాక్టర్ సెల్వమని అభినందించి పథకాలను అందించినట్లు రమేష్ తెలిపారు. విద్యార్థులను కరాటే శిక్షణను అందించి వివిధ టౌర్నమెంట్‌లలో రాణించి పథకాలు అందిచడానికి కృషి చేస్తున్న రమేష్‌ను తల్లిదండ్రులు అభినందించి సన్మానించారు.

విద్యార్థి కుటుంబానికి పరామర్శ

ధర్మపురి, సెప్టెంబరు 16: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నారవేణి శ్రీనిధి కుటుంబాన్ని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతాకుమారి సోమవారం పరామర్శించారు. ధర్మపురి ముదిరాజ్‌వాడకు వెళ్లిన ఆమె విద్యార్థి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సంఘటన దురదృష్టకరమని ఆమె విచారం వ్యక్తం చేశారు. శ్రీనిధి కుటుంబ సభ్యులు తన వంతుగా రూ 5000 ఆర్థికసాయాన్ని ఆమె అందించారు. ఆమె వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగన భట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

గొల్లపల్లి, సెప్టెంబరు 16: గొల్లపల్లి ఆదర్శ పాఠశాలలో 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ కొంతం నగేష్, ఉపాధ్యాయులు జీవీ రమణ, అరుణ్, కిరణ్, పెద్దన్న, రాజశేఖర్, సతీష్ కుమార్, రాజేందర్, మురళీధర్, సంధ్యారాణి, సంధ్య, రమాదేవి, హరిప్రియ, సంధ్యలను సన్మానం చేశారు.

గణపయ్యకు వీడ్కోలు

● ఆకట్టుకున్న మహిళల కోలాటాలు.. ● వైభవంగా గణనాథుల నిమజ్జనోత్సవం



వెల్గటూర్‌లో..

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 16 : మండలంలోని పలు గ్రామాలలో గణపతి నిమజ్జనోత్సవాలు గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మాదాపూర్, చిన్నమెట్‌పల్లి గ్రామంలోని ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలను నిర్వహించిన నిర్వహకులు గణపతి నిమజ్జనోత్సవాలను నిర్వహించారు. భక్తి పాటలు పాడుతూ భజన కార్యక్రమాలను నిర్వహించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ శోభాయాత్ర నిర్వహించారు. యూసుఫ్‌నగర్ గ్రామంలోని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవాలను జరిపారు. గ్రామ శివారులోని వాగు, చెరువులో నిమజ్జనంను జరిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఇబ్రహీంపట్నం, గోధూర్, తిమ్మాపూర్, వర్షకొండ, కోమటికొండపూర్‌తో పాటు ఆయా గ్రామాలలో వినాయక నిమజ్జన ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనాలలో గణపతి శోభాయాత్ర నిర్వహించారు. గ్రామ శివారులోని చెరువులలో, కాకతీయ కాలువలలో నిమజ్జనం చేశారు.

మల్యాల: నవరాత్రులు పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన వేడుకలు మండలంలో సోమవారం ఘనంగా జరిగాయి. మేళాతాలాలు, యువతి, యువకుల నృత్యాలతో ఊరేగింపుగా వెళ్లి ఎస్సారెస్పీ కెనాల్, వరదకాలువ, కుంటలు, చెరువులో నిమజ్జనం చేశారు. కొండగట్టు అంజన్న సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం వినియకుడిని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై ఏ.నరేశ్ కుమార్ సిబ్బందితో పర్యవేక్షించారు.



రాయికల్ పట్టణంలో

వెల్గటూర్: మండలంలోని గ్రామాలలో గణనాథులను సోమవారం నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. వెల్గటూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళ లు నిర్వహించిన శోభాయాత్ర ఆకట్టుకుంది. అనంతరం వినాయకులను గోదావరిలో నిమజ్జనం చేశారు.

కొడిమ్యాల : మండలంలోని వివిద గ్రామాల్లో వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా పూజలందుకున్న వినాయకులను నిర్వాహకులు, భక్తులు సోమవారం రాత్రి వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామాల్లో నిలిపిన వినాయకులను ఘనంగా ఊరేగింపు చేశారు. అనంతరం గ్రామ శివారులోని చెరువులలో నిమజ్జనం చేశారు.

గొల్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్స వాలను పురస్కరించుకుని సోమవారం గణపతి నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జన వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వినాయక ఉత్సవ మూర్తులను వాహనాల్లో ఉంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఆయా గ్రామాల్లోని కుంటల్లో, చెరువుల్లో, కాలువల్లో నిమజ్జనం చేశారు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాలలో సోమవారం వి నాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. మండలంలోని పలు గ్రామాలలో కొలువై ఉన్న కొన్ని గణేష్ మండపాల నిర్వహకులు వైభవంగా వినాయక నిమజ్జనోత్సవలను నిర్వహించారు. భక్తులు నృత్యాలు చేస్తూ శోభా యాత్రగా గ్రామాలలోని పురవీదు ల్లో ఊరేగింపుగా వెళ్లి గ్రామా శివారులలోని కాలువలు, కుంటలు, చెరువుల వద్దకు చేరుకుని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల తాజా మాజీ ప్రజాప్రతి నిధులు మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ జెడ్పీటీసీ పాత పద్మ రమేష్, మాజీ సర్పంచ్‌లు శిల్ప రమేష్, ప్రభాకర్, శ్రీమతి జితేందర్ యాదవ్, యేసుదాసు, మహిపాల్ రెడ్డి, సుగుణ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలను నిర్వహకులు ఘనంగా జరిపారు. సోమవారం గ్రామాల్లోని వాగులు, చెరువులకు వినాయక విగ్రహాలను నిమజ్జన చేయడానికి తరలించారు. ఈ కార్యక్రమంలో కుల, యువజన సంఘాలు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : వినాయక నవరాత్రులు ఘనంగా ముగించుకుట్టున్న భక్తులు సోమవారం గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు జరిపారు. అ న్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మల్లాపూర్, మొగిలిపేట తదితర గ్రామాల్లో వినాయక నిమిజ్జన వేడుకలు ఘనంగా ప్రారంభమైనవి. ప్రత్యే క భజనలతో వినాయకుడి విగ్రహాలను గంగమ్మ ఒడిలోకి చేర్చేందుకు భక్తులు శోభయాత్ర జరుపుతున్నారు.

సారంగాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. నవరాత్రులు విశేష పూజలు అందుకున్న గణనాథులు సోమవారంతో పూర్త వడంతో నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గణనాథులను ఉంచి ఊరేగిస్తూ భక్తులు నృత్యాలు చేస్తూ చెరువుల్లో నిమజ్జనం చేశారు. పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టారు.



కొడిమ్యాలలో..



సారంగాపూర్ పెంబట్లలో నిమజ్జనోత్సవంలో మహిళలు



గొల్లపల్లిలో..

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

మల్లాపూర్, సెప్టెంబరు, 16 : మండలంలోని కొత్తదామరసిపెల్లి గ్రామంలో విశ్వకర్మ జయంతి వేడుకలను కుల సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని ఆలయం సమీపంలో విశ్వకర్మ చిత్రపటానికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా కుల సంఘం అధ్యక్షుడు వేణుగోపాలచారి మాట్లాడుతూ అన్ని కుల వృత్తులకు విశ్వకర్మ గురువని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దం కమలాకర్‌రెడ్డి, ఇల్లెందుల శంకర్, ఇల్లెందుల గణేష్, గడ్డం నవీన్‌రెడ్డి, కాంతయాచారి, పులి సాయిలు, పొలాసారీస్, ఇల్లెందుల నరేష్, ఇల్లెందుల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో సామగ్రి అమ్ముకొనేందుకు బహిరంగ వేలం

మల్లాపూర్, సెప్టెంబరు, 16 : మండలంలోని వివిరావుపేట గ్రామంలోని గంగా గౌరీశ్వర స్వామి దేవాలయంలో సామాగ్రి అమ్ముకొనుటకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి విక్రమ్‌గౌడ్ తెలిపారు. బహిరంగ వేలం సంబంధించిన వివరాలను సోమవారం ప్రకటన ద్వారా తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 2025 సెప్టెంబరు 30 వరకు దేవాలయం ఆవరణంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డూ, పులిహోర వంటి వస్తువులు అమ్ముకొనుటకు హక్కు కల్పించుటకు ఈనెల 20న బహిరంగంగా వేరువేరుగా వేలం వేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాట రోజున ఉదయం 11 గంటలలోపు రూ. 10వేలను డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనలన్నారు.

పదవీ బాధ్యతలు చేపట్టిన ఏఎంసీ పాలకవర్గం



బాధ్యతలు తీసుకుంటున్న పాలకవర్గ సభ్యులు

వెల్గటూర్, సెప్టెంబరు 16: వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుండాటి గోపిక జితేందర్‌రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వైస్ చైర్మన్‌గా గొల్ల తిరుపతి, డైరెక్టర్లుగా ఎండపల్లి పీఏసీఎస్ చైర్మన్ గూడ రాంరెడ్డితో పాటు ద్యావ మహిపాల్‌రెడ్డి, చెల్పూరి చంద్రమౌళి, బీసవేని హరీష్, సింగతి శ్రీనివాస్, సప్ప లింగయ్య, దూడ రవి, కడారి సత్తయ్య, జూ పాక ప్ర వీణ్, మాచర్ల సంజీవ్, పోలోజు శ్రీనివాస్, పోరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పాత రాజేశం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గోపిక మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకు లు మెరుగు మురళి, బండెల ఉదయ్, సందీప్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, సెప్టెంబరు 16: ధర్మపురి క్షేత్రంలో సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు స్వామి వారలను దర్శించుకున్నారు. ఆలయ సూ పరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

●లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని సినీ నటుడు రమేష్ కుటుంబ సమేతంగా సోమవారం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి వారిని ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ వారికి స్వామి ప్రసాదాలు అందించారు.

వేలం పాట వాయిదా

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 16 : మండలంలోని బండలింగాపూర్ గ్రామ శివారులోని గండి హనుమాన్ దేవాలయం ఆవరణంలో పూజ సామగ్రి అమ్ముకొనుటకు బహిరంగ వేలం పాటను ఈవో విక్రమ్‌గౌడ్ నిర్వహించారు. సోమవారం వేలానికి ఎవరూ రాకపోవడంతో రెండవ సారి కూడా వాయిదా వేసినట్లు ప్రకటించారు. దేవాలయంలో పూజ సామగ్రి అమ్ము కొనేందుకు సెప్టెంబర్ 30కి గడువు ముగుస్తుండడంతో అక్టోబర్ 1 నుంచి అమ్ముకోవడానికి వేలం పాటను ఏర్పాటు చేశారు. ఆలయంలో మొదటి సారిగా ఈనెల 6న, రెండవ సారిగా 16 తేదీల్లో నిర్వహించిన వేలం పాటకు ఎవరూ కూడా రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ

కొడిమ్యాల, సెప్టెంబరు 16 : మండల కేంద్రంలోని మసీద్‌లో సోమవారం ముస్లింలు మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముస్లీం సోదరులు మసీద్‌లో ప్రత్యేకంగా ప్రార్థన చేశారు. ఈవే డుకల్లో మసీద్ కమిటీ ప్రెజిడెంట్ రోషన్, ప్రధాన కార్యదర్శి అజీజ్, నాయకులు సుల్తాన్, శుకూర్, సల్మాన్, ఆసీఫొద్దీన్, మంజీర్‌ఖాన్, జాకీర్, నయీం, మోసీన్ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక లడ్డూ వేలంపాట

రాయికల్, సెప్టెంబరు 16: రాయిల్ పట్టణంలోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక మండపంలో సోమవారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. ఈ లడ్డూను వేలం పాటలో రూ.10,016లకు దాసరి శ్రీనివాస్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. మండలంలోని ఇటిక్యాల గ్రామంలో గుడేటి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి లడ్డును రూ.27,100లకు ఏలేటి జీవన్ రెడ్డి, ఏలేటి ప్రతాప్ రెడ్డిలు కైవసం చేసుకున్నారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు

కోరుట్లలో ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు



వాగులో చెత్త చెదారం తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కోరుట్ల, సెప్టెంబరు 16 : పట్టణంలో గణపతి నిమజ్జనం కోసం అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. పట్టణంలోని వివిధ వార్డులలో సుమారు 250 పైగా వినాయకులను ప్రతిష్టించారు. ఈ నెల 17వ తేదీన మంగళవారం నిమజ్జనం చేయడానికి మున్సిపల్, విద్యుత్, పోలీసు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రతి సంవత్సరం నిమజ్జనం చేయాల్సిన గణపతి రథాలకు ప్రత్యేక అలంకరణతో కాలేజీ మైదానానికి చేరుకుంటాయి. మున్సిపల్, పోలీసులు ఉత్సవ కమీటీని ఏర్పాటు చేసి వివిధ మండపాలకు సీరియల్ నంబర్‌ను కేటాయించి కాలేజీ గ్రౌండ్‌కు వచ్చే విధంగా చర్యలు చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన రథాలకు మొదటి, రెండవ, మూడవ బహుమతితో పాటు మైదానానికి మొట్టమొదటగా చేరుకున్న గణపతికి కన్సలేషన్ బహుమతి అందించడానికి ఏర్పాట్లను చేస్తున్నారు. పట్టణంలో కాలేజీ గ్రౌండ్ నుంచి ఐడి రోడ్డు, నంది, కార్గిల్ చౌరస్తాల మీదుగా గాంధీ రోడు నుంచి కాల్వగడ్డ, అంబేద్కర్ నగర్ పట్టణ శివారులోని వాగు వరకు నిర్వహించి వాగు వద్ద నిమజ్జనం చేస్తుంటారు. ఏర్పాట్లను మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య-అనిల్, కమిషనర్ తిరుపతి పరిశీలించారు. నిమజ్జనోత్సవాలు సజావుగా జరిగే విధంగా ఇప్పటికే రూట్ మ్యాప్‌తో పాటు వాగు పరిసర ప్రాంతాలను కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ మహేశ్వర్ రావులు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వాగు వద్ద బారీ క్రేన్‌లను ఏర్పాటు చేశారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు పర్యవేక్షణలో కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు సురేష్‌బాబు, నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో 8మంది ఎస్‌ఐలు, 175 మంది సిబ్బందితో బందోబస్తును నిర్వ హించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని కంచర కుంట, ఎఖీన్ పూర్ శివారులోని వాగు వద్ద బారీ క్రేన్‌లతో నిమజ్జనం చేసే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు.

●పట్టణంలోని పలు వార్డులలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. పలు మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన వేదపండితులు కుంకుమ పూజ, గణపతి ఆవనం కార్యక్రమాలను జరిపారు. నిర్వహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాలను జరిపారు. పలు మండపాల వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య-అనిల్ ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.



ధర్మపురిలో సరస్వతీ పూజలో చిన్నారులు



రాయికల్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

●ధర్మపురి క్షేత్రంలోని పలు వీధుల్లో గల మండపాల్లో నెలకొల్పిన గణనాథుడు సోమవారం పూజలు అందుకున్నాడు. గణనాథుడికి ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సత్రం వద్ద వినాయక మండపంలో చిన్న పిల్లలచే సరస్వతి పూజ నిర్వహించారు. పలు మండపాల వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రాయికల్ పట్టణంలోని క్లబ్ రోడ్డులో వందేమాతరం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో కుంకుమ పూజ నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దావ సురేష్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మ్యాకల రమేష్, మహిపాల్, శ్రీకాంత్, రాజేష్, రమేష్, ఎండీ షాకీర్ పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని రెడ్ స్టార్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో సోమవారం కుంకుమ పూజను ఘనంగా నిర్వహించారు. రెడ్ స్టార్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.